క్లుప్తంగా

పోక్సో చట్టంపై అవగాహన


పోస్టర్ ప్రదర్శిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి, అధికారులు

గాండ్లపెంట: కటారుపల్లి క్రాస్ సమీపంలోని కేజీబీవీలో విద్యార్థినులకు శనివారం కదిరి సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి పోక్సోచట్టం పై అవగాహన కల్పించారు. పోస్టర్ల ద్వారా చట్టం ఎలా ఉపయోగపడుతుందో జడ్జి తెలియజేశారు. పిల్లలపై లైంగిక వేధింపులు, హింస, దోపిడీ, అశ్లీలతల నుంచి రక్షిస్తుందని తెలిపారు. 18 ఏళ్లలోపు పిల్లలందరూ ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయవాదులు నరసింహులు, చౌడప్ప, కదిరి రూరల్ సీఐ నాగేంద్ర, ఎన్.పీ. కుంట ఎస్ఐ వలిబాషా, పాఠశాల ఎస్ఓ దుర్గ, సిబ్బంది పాల్గొన్నారు.

పడమటి వీరన్నకు తరలిన పన్నేరపు బండ్లు


బత్తలపల్లిలో ట్రాక్టర్‌ను ముస్తాబు చేసుకుని వెళ్తున్న భక్తులు

బత్తలపల్లి: మూగజీవాల పట్ల కరుణచూపే ఆరాధ్యదైవం పడమటివీరన్నకు ఉగాదిని పురస్కరించుకొని శనివారం మండలం నుంచి భారీగా పశువులు, పన్నేరపు బండ్లు తరలివెళ్లాయి. తాడిమర్రి మండలం ఆత్మకూరు సమీపంలో వెలసిన పడమటివీరన్నకు మొక్కుకుంటే పశువులకు కీడు జరగదన్నది ప్రజల విశ్వాసం. ఉగాదిముందు రోజు పరమటివీరన్నకు మండలం నుంచే కాక ముదిగుబ్బ, తాడిమర్రి, ధర్మవరం, అనంతపురం మండలాల నుంచి అధికంగా రైతులు పన్నేరపు బండ్లు, పశువులు, ట్రాక్టర్లను అందంగా అలంకరించుకుని స్వామి వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు.

ఉగాది సందడి


జనంతో కిక్కిరిసిన ధర్మవరం పీఆర్‌టీ సర్కిల్


మామిడాకులు కొనుగోలు చేస్తున్న దృశ్యం


టెంకాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ధర్మవరం అర్బన్: ఉగాది పర్వదినం సందర్భంగా పట్టణంలో సందడి నెలకొంది. శనివారం పూజా సామగ్రి, నూతన దుస్తులు కొనుగోలుకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలిరావడంతో ప్రధాన రహదారులన్నీ కిటకిటలాడాయి. పీఆర్‌టీ సర్కిల్ నుంచి అంజుమాన్ సర్కిల్ వరకు వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో వాహనాల రాకపోకలు నిలిపివేశారు.

సర్వసభ్య సమావేశంలో సమస్యల ఏకరువు

నల్లమాడ: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు సమస్యలపై ఏకరువు పెట్టారు. ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి అధ్యక్షతన సమావేశానికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి హాజరయ్యారు. ముందుగా అధికారులు తమ శాఖ ప్రగతిని చదివి వినిపించారు. ఏడాదిగా విద్యుత్ ఏఈ పోస్టు ఖాళీ ఉందని, ఫలితంగా విద్యుత్ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని సభ్యులు తెలియజేశారు. మండల కేంద్రంలో గుడ్డిబావి వీధి, రామస్వామి గుడి వీధి, ఎస్సీ కాలనీ, గ్రామీణ బ్యాంకు నుంచి వైఎస్సార్ కూడలి వరకు కొన్ని రోజులుగా తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని, సమస్య పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి గోవిందు ఎమ్మెల్యేకు విన్నవించారు. రామస్వామి గుడి నుంచి ఎస్సీ కాలనీ వరకు సీసీ రోడ్డు నిర్మించాలని, పంచాయితీ కార్యాలయం వద్ద నిరుపయోగంగా ఉన్న నీటి శుద్ధి యంత్రాన్ని మరమ్మతు చేయించాలని, ఎస్సీ కాలనీలో డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ కే. సూర్యనారాయణ, ఎంపీడీఓ ఆజాద్, తహసీల్దార్ రంగనాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


ఎన్‌పీకుంట: మాట్లాడుతున్న తహసీల్దార్ దేవేంద్రనాయక్

ఎన్‌పీకుంట: ప్రతి ఒక్కరూ హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్ అన్నారు. ధనియానిచెరువులోని విద్యానగర్ కాలనీలో శనివారం సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులను కల్పించిందని, దళితుల పట్ల వివక్షత చూపకూడదని తెలిపారు. సర్పంచ్ దిల్షాద్, ఈటీపీఆర్డీ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: దొన్నికోట ఎస్సీ కాలనీలో శనివారం తహసీల్దార్ రంగనాయకులు ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు, న్యాయవాది వీరనారాయణ, సీఐ నరేంద్రరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్మశాన వాటిక సమస్యను దళితులు అధికారుల దృష్టికి తీసుకురాగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

నల్లచెరువు: గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ రఘునాథ గుప్త, తహసీల్దార్ రవి నాయక్ పేర్కొన్నారు. గోరంట్లవారిపల్లిలో శనివారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఆర్ఐ లక్ష్మీదేవి, వీఆర్ఓ అరవింద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపరచండి

- కౌన్సిల్ మీట్‌లో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు


సమావేశంలో సమస్యలు వివరిస్తున్న సభ్యులు

ధర్మవరం: పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగునకు శాశ్వత చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. కమిషనర్ ప్రమోద్‌కుమార్, వైస్ చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం హాజరయ్యారు. ఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్‌లు మాట్లాడుతూ చెత్త సేకరణకు రూ.90 వేల చొప్పున ట్రాక్టర్లను లీజుకు తీసుకుంటున్నారని, అలాకాకుండా కొత్త ట్రాక్టర్లు కొనుగోలు చేస్తే బాగుంటుందన్నారు. ఉన్న ట్రాక్టర్లకు మరమ్మతు చేయకుండా టెండర్ ద్వారా వాటిని తీసుకోవడం ప్రజాధనం దుర్వినియోగం చేయడమేనన్నారు. కౌన్సిలర్ గోరకాటి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో యథేచ్ఛగా ప్లాస్టిక్ విక్రయాలు జరుగుతున్నాయని, ఇదే విషయమై సాక్షి దిన పత్రికలో వచ్చిందని గుర్తు చేశారు. ప్లాస్టిక్ విక్రయాలను అరికట్టి పర్యావరణాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. రెండో వార్డులో ఉన్న 60 అడుగుల రోడ్డులో కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు కంచె వేస్తున్నా ఏం చేస్తున్నారంటూ టౌన్‌ప్లానింగ్ సిబ్బందిపై వైస్‌చైర్మన్ వేముల జయరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు పెణుజూరు నాగరాజు, గజ్జల శివ, మేడాపురం వెంకటేశ్, జేసీబీ రమణ మాట్లాడుతూ వేసవిలో కాలువల పూడికతీతతో ఉపయోగమేంటని ప్రశ్నించారు. నెలల తరబడి వీధిలైట్ల కొరత ఉందని చెబుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. 25వ వార్డులో ప్లాన్ అప్రూవల్స్ లేకుండా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యం కల్గిస్తోందన్నారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ వచ్చే కౌన్సిల్‌సమావేశంలోపు ఈ సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

మైనాస్వామికి ఉగాది పురస్కారం



పుట్టపర్తి టౌన్: ప్రముఖ చరిత్రకారుడు, పురావస్తు పరిశోధకుడు రచయిత మైనాస్వామిని రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారంతో సత్కరించనుంది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులు మీదుగా ఆయన ఉగాది పురస్కారం అందుకోనున్నారు. శాసన పరిశోధన, లేపాక్షి వీరభద్రాలయానికి సంబంధించి పుస్తకాల ముద్రణ తదితర అంశాలు పరగణలోకి తీసుకుని సాంఘిక సేవా విభాగంలో పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.

ఉగాది శుభాకాంక్షలు


దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి


కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

పుట్టపర్తిటౌన్: పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఉగాది శుభాకాంక్షలు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలతో తులతూగాలని ఆయన ఆకాంక్షించారు. తెలుగు వారికి అతి ముఖ్యమైన ఉగాది పండుగను సంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని సూచించారు.

ధర్మవరం రూరల్: ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి శనివారం ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో ప్రజలకు సకల శుభాలు జరగాలని ఆకాంక్షించారు.

ఘనంగా మహానగర సంకీర్తన


నగర సంకీర్తనను ప్రారంభిస్తున్న రత్నాకర్ దంపతులు

పుట్టపర్తి రూరల్: సత్యసాయి శత జయంత్యుత్సవాలను పురస్కరించుకుని పుట్టపర్తిలో శనివారం సత్యసాయి మహా నగర సంకీర్తన ఘనంగా జరిగింది. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నకర్, హిమవాని దంపతులు సాయంత్రం హనుమాన్ కూడలి వద్ద పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్యసాయి బాబా నిలువెత్తు విగ్రహాన్ని సర్వధర్మ చిహ్నాన్ని రథంపై ఉంచి ఊరేగించారు. సత్యసాయిని కీర్తిస్తూ భక్తి గేయాలు, చెక్కభజనలు చేస్తూ గణేష్ గేట్ వరకూ చేరుకుని మంగళహారతులతో ముగించారు.

బైక్ అపహరణ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రామ్‌నగర్‌లో బైక్(బుల్లెట్) అపహరణకు గురైంది. కాలనీకి చెందిన సింగేటి భరత్ శుక్రవారం రాత్రి ఇంటి ముందు ఉంచాడు. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి బైక్‌ను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు టూ టౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఇన్విజిలేటర్లపై సస్పెన్షన్ ఎత్తేయాలి

ధర్మవరం అర్బన్: పదో తరగతి పరీక్షల్లో సస్పెండ్ అయిన ఇన్విజిలేటర్ల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్పను శనివారం యూటీఎఫ్ నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు రామకృష్ణనాయక్, సకల చంద్రశేఖర్, లక్ష్మయ్య, అమర్‌నారాయణరెడ్డి, బిల్లే రామంజనేయులు, ఆదిశేషు, వెంకటకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

యోగివేమన బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

గాండ్లపెంట: కటారుపల్లిలో విశ్వకవి యోగివేమన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను శనివారం అధికారులు పరిశీలించారు. వచ్చే నెల 6 నుంచి మూడు రోజుల పాటు ఆలయ పీఠాధిపతుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈసందర్భంగా తహసీల్దార్ బాబురావు, కదిరి రూరల్ సీఐ నాగేంద్ర ఆలయ పరిసరాలను పరిశీలించి ఏర్పాట్లపై పీఠాధిపతిని అడిగి తెలుసుకున్నారు. తలుపుల ఎస్ఐ నరసింహుడు, ఆలయ పీఠాధిపతి నందవేమారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిల్పారామంలో నేడు ఉగాది సంబరాలు

పుట్టపర్తి టౌన్: ఎనుములపల్లి సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటలకు ఉగాది సంబరాలు నిర్వహించనున్నట్లు శిల్పారామం ఏఓ ఖాదర్‌వలి తెలిపారు. పురోహితులు నాగరాజశర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. గురుపాద ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

లారీ మెకానిక్ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన లారీ మెకానిక్ మురళి శనివారం మున్సిపల్ ఆఫీస్ సమీపంలో విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్నేహితులు మురళిని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కేతిరెడ్డికాలనీలో చోరీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేతిరెడ్డికాలనీలో చేనేత కార్మికుడి ఇంట్లో చోరీ జరిగింది. టూ టౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపిన వివరాలు.. కాలనీకి చెందిన చేనేత కార్మికుడు ప్రకాష్ తన కుటుంబ సభ్యులతో శుక్రవారం వేరే గ్రామానికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన దొంగలు తిరిగి శుక్రవారం రాత్రి ఇంటి తాళం పగులగొట్టి లోపలకు ప్రవేశించి బీరువా తలుపులు ధ్వంసం చేసి అందులో ఉన్న అర తులం బంగారు కమ్మలు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నర్సు అదృశ్యం


పూజిత

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేసే పూజిత అదృశ్యమైంది. ఈనెల 26న ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన నర్సు తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆమె తల్లి భాగ్యలక్ష్మి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి గాలింపు చేపట్టినట్లు టూ టౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌కు సన్మానం

తలుపుల : బదిలీపై వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ నల్లప్పను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎస్ఐ నరసింహుడు ఆధ్వర్యంలో పోలీసులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు మస్తాన్, గుర్రప్ప, తదితరులు పాల్గొన్నారు

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహకాలు

కనగానపల్లి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేసే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు జెడ్‌బీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ పెద్దిరెడ్డి తెలిపారు. ముక్తాపురం గ్రామంలో శనివారం ప్రకృతి వ్యవసాయం, ఖరీఫ్ పంటల సాగు ప్రణాళికలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో కలసి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సమావేశంమై ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. వీఏఏ రుక్మిణీ, వెలుగు సీసీలు, జెడ్‌బీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తలుపుల: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు..గజ్జలప్పగారిపల్లికి చెందిన టి.ఆంజినేయులు (50) ఈనెల 24న గంగమ్మ గుడి సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత అనంతపురం తీసుకెళ్లారు. చికిత్స ఫలించకపోవడంతో శనివారం అక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఆదిలక్ష్మమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదిలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.



దేవతలారా రండి.. మీ దీవెనలందించండి


పూజల్లో పాల్గొన్న భక్తులు


అలంకరణలో అక్కదేవతల విగ్రహాలు

- నేడు ఒంటికొండలో నరసింహస్వామి, చెన్నుడు, అక్కదేవతల ఊరేగింపు
- భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న ఉత్సవాలు


ఎలవ గంప కోసం మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ఒంటికొండ గ్రామంలో అక్కదేవతల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈనెల 28వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలు 31వ తేదీ వరకూ జరగనున్నాయి. భక్తుల కోర్కెలు తీరుస్తున్న అక్కదేవతల దర్శనానికి భక్తులు తరలివస్తున్నారు. ఈనెల 28న (మొదటి రోజు) ఎలవ గంపను తీసుకొచ్చేందుకు కాలినడకన వెళ్లారు. పూజారితో పాటు భక్తులు కలసి కాలినడకన ఒంటికొండ నుంచి ఓబుళంపల్లి, ప్రసన్నాయపేట, కొడపగానపల్లి, మైలేపల్లి గ్రామాల మీదుగా లింగారెడ్డిపల్లికి చేరుకున్నారు. అక్కడ పూజలు చేసుకుని ఎలవ గంపను తీసుకొని తిరిగి గ్రామానికి పాదయాత్రగా బయలుదేరారు. 29వ తేదీన (రెండవ రోజు) ఒంటికొండ నుంచి అమ్మవారి ప్రతిమలు (గిరిగలు) అమ్మవారికి అలంకరించే ఆభరణాలను తీసుకెళ్లి ఊరేగింపుగా గ్రామానికి కాలినడక విచ్చేశారు. 30వ తేదీ ఉగాది రోజు తెల్లవారుజామున గ్రామానికి చేరుకుంటారు. గ్రామ సమీపంలో అమ్మవారిని అలంకరించి, నరసింహ స్వామి, చెన్నుడు, అక్కదేవతలను మేళతాళాలతో ఊరేగిస్తారు. ఈ ఊరేగింపు గ్రామంలోని ప్రధాన రహదారి గుండా సాగి దేవాలయం వరకూ కొనసాగుతుంది. ఈ సందర్భంగా భక్తులు స్వామికి ఫల, పుష్పాలు, కానుకలు సమర్పించి పూజలు చేయిస్తారు. దేవాలయం వద్దకు చేరుకున్న స్వామి వారి ముందు భక్తులు తమ కోర్కెలు నెరవేరాలని కోరుతూ మొకరిల్లుతారు. మరుసటి రోజు (31వ తేది) చిన్నారులను (ఆడపిల్లలు) పసుపు, కుంకుమలతో అలంకరించి, అమ్మవారి కొలనులో స్నానం చేయిస్తారు. మధ్యాహ్నం కుంకుమను భక్తిశ్రద్ధలతో చల్లుకుంటారు. ఉత్సావాల సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.